నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: స్ట్రీట్ నంబర్–8 హబ్సిగూడ 33/11 కేవి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రీన్‌హిల్స్ కాలనీ, వీవీనగర్, సాయిసుఖ్ అపార్టుమెంట్, ఐఎస్ఐ, జెఎస్ఎన్ కాలనీ, విజ్ఞాణపురి కాలనీ, గాంధీ గిరిజన బస్తీ, రవీంద్రానగర్, మహేశ్వరినగర్, ఉప్పల్ స్టేడియం, లక్ష్మీనగర్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. హబ్సిగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఎన్జీఆర్ఐ తదితర ప్రాంతాల్లో 10గంటల నుంచి 10.30గంటల వరకు వీధి నంబర్.3, 4, కాకతీయనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చెంగిచెర్ల పీఅండ్‌టీ ఫీడర్ పరిధిలో...

మేడిపల్లి: చెంగిచెర్ల పీఅండ్‌టీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు మరమ్మతుల కారణంగా 33/11 కేవి పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం సాయంత్రం 3.30 గంటల నుంచి 4గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, వెస్టు కమలానగర్, విశ్వం విహార్‌కాలనీ, సుమా రెసిడెన్సీ, గురు ఎంక్లేవ్, భగత్‌సింగ్ గర్, అయోధ్యకాలనీ, ఎస్‌సీకాలనీ, సాయినగర్ ఈస్టు, బాపూజీనగర్, అరుణోదయ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్, టీఎస్ ఫుడ్స్‌కాలనీ, కాకతీయకాలనీ, జయశ్రీకాలనీ, యాదయ్య నగర్, దర్మక్షేత్రకాలనీ, కమశానగర్, చిన్నక్రాంతి కాలనీ, అరవింద ఎన్‌క్లేవ్, రామకృష్ణ నగర్, మైవిల్లాస్ కాలనీల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయత్రం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని జైశ్రీరాంకాలనీ, కనకదుర్గా నగర్, అణుశక్తినగర్, సిరిపురంకాలనీ, పెద్దమ్మ గుడి ఏరియా, గాంధీనగర్, మన భూమి వెంచర్‌లో శనివారం ఉదయం 11 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ చెంగిచెర్ల పీఅండ్‌టీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిదుర్గా నగర్, క్రాంతికాలనీ, ద్వారకానగర్, జీపీ ఆఫీస్ ఏరియా, రాధికానగర్‌లలో శనివారం మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ తెలిపారు.

వినాయక్‌నగర్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వినాయక్‌నగర్ వాసులు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ వినాయక్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా వీధి నం.23లో కాలనీవాసులు ఎదుర్కొంటున్న భూగర్భ డ్రైనేజీ పనులు, వీధి లైట్ల ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బద్దం పరశురాంరెడ్డి, బాలకృష్ణగుప్తా, కాలనీవాసులు విష్ణుమూర్తిగౌడ్, బాలనరసింహ, శ్రీకాంత్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

18 మెట్లు.. 18 అధ్యాయాలపై గరికపాటి ప్రవచనం 29న

మల్కాజిగిరి: అయ్యప్పస్వామి పద్దెనిమిది మెట్లు – భగవద్గీతలోని 18 అధ్యాయాలను అనుసంధానిస్తూ ఈనెల 29వ తేదీ ఆదివారం సాయంత్రం 4గంటలకు గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమం జరుగుతుందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. మణికంఠ భక్త సమాజం కుషాయిగూడ, లిపిగేమ్ సంయుక్తంగా ఈ కార్యక్రమం సాయినగర్‌లోని షిరిడీసాయిబాబా దేవాలయం ప్రాంగణంలో జరుగుతోందని అయ్యప్ప భక్తులు హాజరుకావాలని కోరారు.


అయ్యప్ప ఆలయ వార్షికోత్సవ పూజలో ఎంపీ ఈటల రాజేందర్


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఆద్యంతం ఆధ్యాత్మికం

దేవాలయాల వార్షికోత్సవాలు.. అయ్యప్పస్వామి పడి పూజలు

కాప్రా: సాయిబాబానగర్‌లో జరిగిన ఆధ్యాత్మిక మహోత్సవం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. అయ్యప్పస్వామి ఆలయ షష్టమ వార్షికోత్సవం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగింది. శ్రీసాయి సేవ ట్రస్ట్ ఛైర్మన్ రేగ్గ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవం కార్యక్రమం శుక్రవారం ఉదయం గణపతి హోమంతో ప్రారంభమైంది. అనంతరం కలషాభిషేకం, కోటి తులసి అర్చన, అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. పడిపూజ సమయంలో అయ్యప్ప భక్తుల పాటలతో పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు హరినాథ్‌రెడ్డి, శేఖర్‌చారి, ప్రసాద్, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు నీలంరెడ్డి, మర్రి మోహన్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ

మౌలాలి: అయ్యప్పస్వామి మహా పడిపూజ శుక్రవారం మౌలాలి బీఆర్ఎస్ నేత వంశీ ముదిరాజ్ సారథ్యంలో వైభవంగా జరిగింది. అనంతరం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులందరినీ ఆకట్టుకున్నాయి. చుట్టూ పక్కల భక్తులు విచ్చేసి అయ్యప్పస్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. మణికంఠ వేషధారణలో ఓ చిన్నారి అందరినీ ఆకట్టుకుంది.

అయ్యప్ప కరుణాకటాక్షాలు ప్రజలపై ఉండాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ బొడిగె స్వాతికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో అమ్మ శబరీ గార్డెన్‌లో శుక్రవారం ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం మేయర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి అయ్యప్పస్వామి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శారద ఈశ్వర్‌రెడ్డి, ప్రసన్న లక్ష్మీశ్రీధర్‌రెడ్డి, పప్పుల అంజిరెడ్డి, అయ్యస్వాములు తదితరులు పాల్గొన్నారు.


మణికంఠ వేషధారణలో చిన్నారి


అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న మేయర్ అమర్‌సింగ్

ఆర్‌యూబీ పనులు చేపట్టండి

• రైల్వే జీఎం అరుణ్‌జైన్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి


రైల్వే జీఎంతో సమావేశమైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో అనుమతులు మంజూరైన ఆర్‌యూబీ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌జైన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయనతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాజుపేయినగర్, గౌతంనగర్ ఆర్‌యూబీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాల నుంచి అనుమతులు మంజూరయ్యాయని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఆర్‌కేపురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి అదనంగా రెండు లైన్ల నిర్మాణం కోసం, తుర్కపల్లి ఆర్‌యూబీ నిర్మాణం పనులు, బొల్లారం బజార్ కొత్తబస్తీ సమీపంలోని రైల్వే స్థలంలో ఉన్న నాలా సమస్య పరిష్కరించాలని కోరామన్నారు.

◆ గౌతంనగర్ డివిజన్ మీర్జాలగూడ ప్రాంతంలో రైల్వే క్వార్టర్స్ ఉన్న ప్రాంతంలో దశాబ్దాల క్రితం రేణుకాఎల్లమ్మ దేవాలయం నిర్మాణం జరిగిందని ఆలయం కూల్చివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరామన్నారు. వినాయకనగర్ డివిజన్ కేశవనగర్‌లో రైల్వే స్థలం ప్రహరీ సమీపంలో మహిళలు కుట్టుమెషిన్ కేంద్రం ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఆ స్థలం ఖాళీ చేయాలని బోర్డు ఏర్పాటు చేశారని వారికి న్యాయం చేయాలని కోరామన్నారు. జీఎం సానుకూలంగా స్పందించారని త్వరలోనే ఆర్‌యూబీల నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు.

నేడు వికాస్‌నీతి యాప్ ప్రారంభం

◆ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, సమస్యలు ప్రణాళికాబద్ధంగా సకాలంలో పరిష్కరించేందుకు రూపొందించిన వికాస్‌నీతి యాప్‌ను శనివారం ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. యాప్ పనితీరు తదితర అంశాలను తెలియజేస్తామన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో ఉప్పల్ ముందంజ


జిల్లా నాయకులకు క్రియాశీల సభ్యతం, బూత్ కమిటీ పత్రాలను అందిస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: బీజేపీ చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం ముందంజలో ఉందని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి పోతగాని గోపాల్‌గౌడ్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానిక చెందిన క్రియాశీల సభ్యతం, బూత్ కమిటీ పత్రాలను శుక్రవారం జిల్లా కమిటీకి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ప్రస్తుతం బూత్ కమిటీల నియామకం కొనసాగుతోందన్నారు. అనంతరం డివిజన్ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షుల నియామకం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావుల బాలకృష్ణగౌడ్, బాలచందర్, రవినాయక్, వెంకట్రావు, సోమశేఖర్‌గౌడ్, మల్కా ప్రకాష్, నవీన్‌కుమార్, చంద్రమౌళి, యోగేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, రఘుపతిగౌడ్, రజనీకాంత్‌రెడ్డి, వెంకటాచలం, జీవీఎస్ రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్


ఆటోడ్రైవర్ శ్రీనివాస్‌ను సత్కరించిన ఎస్సై పురేందర్

కుషాయిగూడ: ఆటోలో ప్యాసింజర్ మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి ఆటోడ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. శ్రీనివాస్ అనే ఆటోడ్రైవర్ తన ఆటోలో ప్రయాణించిన ఓ గుర్తు తెలియని ప్రయాణికుడిని చర్లపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న బస్‌స్టాప్ వద్ద డ్రాప్ చేశాడు. కొద్దిసేపటికి ఆటోలో సెల్‌ఫోన్‌ను గుర్తించి ప్రయాణికుడి కోసం వెతకగ కనిపించలేదు. దీంతో సెల్‌ఫోన్‌ను నిజాయితీతో చర్లపల్లి పోలీసులకు అప్పగించారు. ఆటోలో దొరికిన సెల్‌ఫోన్‌ను అందజేసిన డ్రైవర్ శ్రీనివాస్‌ను ఎస్ఐ పురేందర్ అభినందించారు. గతంలోను ప్యాసింజర్ తన ఆటోలో వదిలివెళ్లిన సెల్‌ఫోన్‌ను శ్రీనివాస్ పోలీసులకు అప్పగించాడని, శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకొని ఆటోడ్రైవర్లు నిజాయితీని చాటుకోవాలన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నేతలు రామాంజనేయులు, దేవరాజ్ నర్సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

పరారీలో మరో ఇద్దరు

మల్కాజిగిరి: చైన్ స్నాచర్‌కు పాల్పడుతున్న వ్యక్తిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. హరియాణా రాష్ట్రం నూహ్ జిల్లా స్వేకా గ్రామానికి చెందిన సలీం (36), అనూప్‌సుల్తాన్, షాహెద్ స్నేహితులు. మియాపూర్‌లో నివాసముంటూ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఈనెల 6వ తేదీ మౌలాలి ప్రశాంత్‌నగర్ రైల్వే క్వార్టర్స్‌లో ఉదయం వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ చేశారు. శుక్రవారం సమాచారం అందుకున్న పోలీసులు సలీంను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీ కోసం ఉపయోగించిన పల్సర్ బైక్, వీవో ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. దొంగలించిన గొలుసుతో మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారని వారు తెలిపారు.

నత్తనడక పీర్జాదిగూడ రోడ్డు విస్తరణ పనులు


గుంతలమయంగా పీర్జాదిగూడ నుంచి పర్వతాపూర్ రోడ్డు మార్గం

మేడిపల్లి: పీర్జాదిగూడ కమాన్ నుంచి పర్వతాపూర్ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. విస్తరణ పనులను సుమారు రూ.26కోట్లతో చేపట్టారు. అయినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాహనదారులు ఈ రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారు. గత్యంతరం లేక ఈ రోడ్డు గుండా వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా... ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ భరత్‌నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డు రెండేళ్ల క్రితం మంజూరయ్యిందన్నారు. పలు సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక చొరవతో రోడ్డు విస్తరణ, బోర్‌వెల్‌లపై ఉన్నతాధికారులతో చర్చించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, మల్లికార్జున్, శివరాజ్, వెంకటేష్, నర్సింహ, చందు, హరి, సుదర్శన్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

పని చేసుకోవడానికి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు


షేక్ శంషుద్దీన్(ఫైల్)

ఉప్పల్: పని నేర్చుకోవడానికి కర్నూలు నుంచి నగరానికి వచ్చిన ఓ బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు జిల్లా సిబెలగల్ మండలానికి చెందిన నబీ రసూల్‌కు ముగ్గురు కుమారులు అందులో పెద్ద కుమారుడు షేక్ శంషుద్దీన్(13) ఐదో తరగతి పూర్తి చేసుకున్నాడు. పని నేర్చుకోవడానికి బోడుప్పల్, వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న పెద్దనాన్న కుమారుడు అన్వర్ పాషా వద్దకు ఐదు రోజుల క్రితమే వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉప్పల్ సత్యనగర్‌లోని నెక్స్ట్‌జెన్ మెడికల్ కోడింగ్ ఇన్‌స్టిట్యూట్ వద్దకు పని చేయడానికి వచ్చారు. ఇనిస్టిట్యూట్‌కు సంబంధించిన బోర్డు ఫిక్స్ చేయడానికి సోదరుడితో కలిసి పనిచేస్తూ కోడింగ్ బోర్డును కిందకు దింపుతుండగా ప్రమాదవశాత్తు ఇనిస్టిట్యూట్ ముందు ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ఇద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో తీవ్ర గాయలపాలైన షేక్ శంషుద్దీన్ కిందపడి పోయాడు. దీంతో ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శంషుద్దీన్ మృతి చెందాడు. అన్వర్ పాషా చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

దీప్తి ఆత్మహత్యకు పోలీసులే కారణం


నాచారం పోలీసుల తీరుకు నిరసనగా దళిత సంఘాల జేఏసీ ర్యాలీ

మల్లాపూర్: నాచారం సరస్వతినగర్ కాలనీకి చెందిన పీహెచ్‌డీ విద్యార్థిని దీప్తి ఆత్మహత్యకు పోలీసులే కారణమని దళిత సంఘర్షణ సమితి నేషనల్ కో–ఆర్డినేటర్ నల్ల రాధాకృష్ణ ఆరోపించారు. నాచారం పోలీసులు ఎఫ్ఐఆర్‌లో దీప్తి పేరు అక్రమంగా చేర్చినందుకే తాను ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. పోలీసుల తీరుకు నిరసనగా నాచారం దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీప్తిపై అక్రమంగా కేసులు నమోదు చేయించిన కానిస్టేబుల్ అనిల్, అతని భార్య అనితను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, రామకృష్ణ, నాగరాజు, నవీన్, హరిబాబు, ప్రమోద్ కుమార్, అంజి, యుగంధర్, ప్రభాకర్, యాదగిరి, బాల్‌రాజ్, సంపత్, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని డా.మన్మోహన్‌సింగ్‌కు నివాళి


ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయంలో..


అల్వాల్‌లో కాంగ్రెస్ నాయకులు


కాప్రా తహసీల్దార్ కార్యాలయం వద్ద..


రామంతాపూర్ ప్రధాన రహదారిలో..


మల్కాజిగిరి చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నేరేడ్‌మెట్‌లో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


కుషాయిగూడ మార్కెట్ వద్ద మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్‌సింగ్ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలు పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. శుక్రవారం పలు కూడళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, ఆర్థికమంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించి ఆ పదవికే వెన్నె తెచ్చారని అన్నారు. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ప్రధానుల్లో ఆయన ఒకరని కొనియాడారు. దేశ ఆర్థిక చరిత్రనే మలుపు తిప్పిన నాయకుడన్నారు. చరిత్రాత్మకమైన ఎన్నో పథకాలు మన్మోహన్‌సింగ్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని గుర్తు చేసుకున్నారు. దేశంలో ఆధార్ కార్డు, ఆర్‌టీఐ చట్టం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లు, ఉపాధి హామీ పథకం వంటి సంస్కరణలు ఆయన హయాంలోనే జరిగాయని అన్నారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలకు భారత ప్రభుత్వం ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించిందని అన్నారు.

– మల్కాజిగిరి/ఉప్పల్‌జోన్ బృందం